

సురక్షిత గమ్యం..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్నాయి. అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

- 8లో



మహాత్మునికి నివాళి

గాంధీ వర్ధంతి సందర్భంగా ఊరూరా మహాత్మునికి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని గాంధీ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.


2న సామూహిక సూర్య నమస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్: రథ సప్తమి ఉత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 2న 80అడుగుల రోడ్డులో సామూహిక సూర్యనమస్కారాలు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ కోరారు. నగరంలోని ఆయుష్ కార్యాలయం లోని తన చాంబర్‌లో ఆయన పలు యోగా సెంటర్ల కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు.



అరసవల్లి మిల్లు కూడలి వద్ద సప్తాశ్వరథంతో ఆదిత్యుడు







దర్శన మార్గాలలో విద్యుత్ కాంతుల మల్లెపందిరి

● వెలుగుల వేడుక

రథ సప్తమి ఉత్సవాన్ని తొలిసారిగా రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజుల మహోత్సవానికి స్వాగతం పలుకుతూ విద్యుత్ కాంతుల స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. - అరసవల్లి

న్యూస్‌రీల్

రేపటి నుంచి దాతల పాసులు జారీ

అరసవల్లి: అరసవల్లిలో రథసప్తమి పర్వదినం సందర్భంగా విశిష్ట దాతలకు ప్రత్యేకంగా డోనర్ పాసులను అందించేందుకు ఆలయ ఈఓ వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దాతల వివరాలతో ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసిన క్రమంలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సంబంధిత దాతలు లేదా సంబంధిత వ్యక్తులు స్వయంగా వచ్చి పాసులను వెంట తీసుకెళ్లాలని ఆయన కోరారు.

2 నుంచి టెంపుల్ టూరిజం

అరసవల్లి: ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 2,3,4 తేదీల్లో రథసప్తమి సందర్భంగా టెంపుల్ టూరిజం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా పర్యాటకశాఖాధికారి ఎన్.నారాయణరావు ప్రకటించారు. ఈమేరకు రథ సప్తమి సందర్భంగా టూరిజం శాఖ తరపున మినీ బస్సులో అరసవల్లి నుంచి శ్రీకూర్మం, మొగదలపాడు,శాలిహుండం,శ్రీముఖలింగం, రావివలస తదితర పుణ్యక్షేత్రాలను సర్క్యూట్‌గా తిప్పి చూపిస్తారని ప్రకటించారు. ఇందు కోసం ఒక వ్యక్తి రూ.750 చెల్లించాలని, ఆసక్తి గల పర్యాటకులు అరసవల్లి జంక్షన్‌లో ఉన్న సన్‌రైజ్ హోటల్‌లో ఉన్న టూరిజం కౌంటర్ వద్దకు వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే ఎంట్రీ ఫీజులు, భోజనాలకు పర్యాటకులదే బాధ్యతని గుర్తుచేశారు.

అరసవల్లిలో తగ్గనున్న హడావుడి

అరసవల్లి: రథసప్తమి రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత అరసవల్లిలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే గురువారం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దీనిపై పెద్ద చర్చే జరుగుతోంది. అరసవల్లిలో వచ్చే నెల 3న అర్ధరాత్రి 12 గంటల నుంచి రథసప్తమి మహోత్సవం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ నేతల హడావుడి కాస్త తగ్గనుంది. అలాగే అంతకుముందు కూడా ఏర్పాట్లపై సమీక్షలు, సమావేశాలు చేసే వీలుండదు. కలెక్టర్ కూడా ఈ మేరకు కోడ్ నిబంధనలు అమల్లో ఉన్నట్లుగా ప్రకటించడంతో రాజకీయ జోక్యం ఉండే అవకాశం లేదని స్పష్టమైంది.

2,3 తేదీల్లో కళల జాతర



శ్రీకాకుళం కల్చరల్: రథసప్తమి వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 2,3 తేదీల్లో కళల జాతర వేడుకలు ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతాయని సాంస్కృతిక కార్యక్రమాల ప్రతినిధి, సంప్రదాయం డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ సాయంత్రం 5గంటలకు ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ వారి సినీలైట్ మ్యూజిక్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతున్నాయి. తర్వాత దుంపల ఈశ్వర రావు బృందంతో సినీ క్లాసికల్ మ్యూజిక్, యామిని కృష్ణ క్లాసికల్ వోకల్ ప్రదర్శన, పరిమళ గ్రూప్ ఆధ్వర్యంలో క్లాసికల్, ఫోక్ డ్యాన్సులు, అనూరాధ నృత్య దర్శకత్వంలో క్లాసికల్ డ్యాన్సులు, లక్ష్మీగణపతి శర్మ తో సినీ క్లాసికల్ మ్యూజిక్, దమ్‌దమ్ కార్యక్రమంలో భాగంగా జోష్ శివ, భూమిక, ఫైమా, రేలా రేలా, మిమిక్రీ ఆనంద్, షణ్ముఖి, సురేష్, రెష్మా, బాలాజీల పాటల ప్రదర్శన, ప్రముఖ రంగస్థల కళాకారులు యడ్ల గోపాలరావు ఆధ్వర్యంలో 'పంచరత్నాలు' పౌరాణిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 3న సాయంత్రం 5 గంటలకు సుందరంపల్లి శ్రీనివాస్ శాక్సాఫోన్ కచేరి, అనంతరం నరసన్నపేటకు చెందిన శాంతారాం బృందం బుర్రకథ, తారకరామారావు ఎరుకుల పాట ప్రదర్శన, మావుడూరు సత్యనారాయణ శర్మ వాయులీన కచేరి, నీరజ సుబ్రహ్మణ్యం క్లాసికల్ నృత్య ప్రదర్శన, రఘుపాత్రుని శ్రీకాంత్ క్లాసికల్ నృత్య ప్రదర్శన, సంప్రదాయం కూచిపూడి గురుకులం యోగా డ్యాన్సు, తర్వాత లేజర్ షో, ప్రముఖ సినీగాయని మంగ్లీ బృందంతో సినీ మ్యూజిక్ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

అరసవల్లి: రథసప్తమి సందర్భంగా అరసవల్లిలో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ అన్నారు. గురువారం ఆయన స్థానిక అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆదిత్యుడిని దర్శించుకుని రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖాధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న విషయాన్ని అధికారులు గమనిస్తూ చర్యలు చేపట్టాలన్నారు. అరసవల్లి ఆలయంలో ఇటీవల కాలంలో జరిగిన పలు అక్రమాలు, చర్యలపై 'సాక్షి' ప్రచురించిన వరుస కథనాలపై దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ స్పందించారు. ఈ మేరకు ఆలయ అధికారుల వద్ద ప్రస్తావిస్తూ 'రిటైర్డ్ ఉద్యోగుల అవసరం ఇక్కడ ఉందా...!' అని అడిగినట్లుగా సమాచారం. అరసవల్లి ఆలయంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న దినసరి వేతనదారులు కమిషనర్ రామచంద్రమోహన్‌ను కలిసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు.

దాతృత్వానికి పరీక్ష



మళ్లీ దాతల కోసం వెంపర్లాట..!

- అరసవల్లిలో దాతలు ఇచ్చిన నిర్మాణాల కూల్చివేత
- కొత్త నిర్మాణాలకు మళ్లీ దాతల సహకారానికి విజ్ఞప్తి
- ప్రభుత్వ తీరుపై భక్తుల విస్మయం

అరసవల్లి:

రథసప్తమి వేడుకల నిర్వహణ పేరుతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు విస్మయం గొలుపుతోంది. అరసవల్లి ఆదిత్య క్షేత్ర ప్రగతిలో దాతల పాత్ర అత్యంత కీలకమైనది. ఈ క్షేత్రం దేవేంద్ర ప్రతిష్ఠితమే అయినా 1999లో వరుదు బాజ్జీరావు అప్పట్లోనే రూ.40 లక్షలు ఖర్చు పెట్టి ప్రధాన విమాన గోపురాన్ని నిర్మించాక ఆలయ శోభ ద్విగుణీకృతమైంది. ఒక విధంగా ఆలయ అభివృద్ధిలో దాతల ప్రస్థానం అప్పటి నుంచే ఆరంభమైందని కూడా చెప్పవచ్చు. కాలక్రమేణా చాలా మంది దాతలు స్థాయిని బట్టి రూ.లక్షల్లో విరాళాలిచ్చి ఆలయ స్వరూపం మారడానికి దోహదపడ్డారు. ప్రముఖ వ్యాపారి గ్రంథి మల్లికార్జునరావు (జీఎంఆర్) భాగస్వామ్యంతో అనివెట్టి మండపం, ట్రైమెక్స్ కంపెనీ అధినేత కోనేరు రాజేంద్రప్రసాద్ అన్నదాన మండపం, తర్వాత జిల్లాకు చెందిన ఎంతో మంది వ్యాపారులు, రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు తమ పేర్లు, తమ పెద్దల పేర్లతో రూ.లక్షల విలువైన జింకు రేకు షెడ్లు, వసతి గదుల నిర్మాణాలు, మరుగుదొడ్ల కాంప్లెక్సులు, నిత్యాన్న దాన పథకానికి రూ.లక్ష చొప్పున విరాళాలిచ్చి తద్వారా ఆలయ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. 2024 వరకు దాతల ప్రోత్సాహంతోనే ఆలయ పరిసరాల్లో కొత్త కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ భక్తులకు సౌకర్యం కల్పించడానికి ఇతోధికంగా దోహదపడ్డాయి. కానీ 2025 రథ సప్తమికి సీన్ అంతా మారిపోయింది. ఎంతో మంది దాతలు భక్తితో ఇచ్చిన సొమ్ముతో కట్టిన నిర్మాణాలన్నీ కూల్చేశారు.



ఇప్పటికే భవనాల కూల్చివేతతో దాతల పేర్లు మాయమయ్యే పరిస్థితి వచ్చింది. ఈ వైనాన్ని దాతలు సహించలేకపోతున్నారు. దీనికి తోడు ఇప్పుడు స్థానిక రాజకీయ నేతలు, జిల్లా ఉన్నతాధికారులు మళ్లీ దాతల సాయాన్ని కోరుతున్నారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశమైంది. రథసప్తమి మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న క్రమంలో జిల్లాకు, నగరానికి చెందిన వర్తక, వ్యాపార రంగాల ప్రతినిధులు తమ వంతుగా ఆలయంలో ఉత్సవ నిర్వహణకు విరాళాలివ్వాలని, లేదంటే తగినట్లుగా సహకారం ఇవ్వాలంటూ వేడుకోవడం జిల్లా వ్యాప్తంగా చర్చలకు దారితీస్తోంది.

దాతల పేర్లు లేకుండా చేసి..

ఆలయానికి విరాళాలిచ్చిన దాతలు తమ పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలని ఎంతో ఆశపడతారు. 2010 నుంచి ఆలయంలో వివిధ స్థాయిల్లో దాతలు రూ.లక్షల విరాళాలతో ఆలయ పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టారు. అలాగే 2020 నుంచి ఈ రకమైన దాతల ప్రోత్సాహం మరింత రెట్టింపయ్యింది. తాజాగా అరసవల్లి ఆలయంలో రథసప్తమి మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో ఒక్కసారిగా ఈ నెల రోజుల్లోనే ఆలయ పరిసరాల్లో దాతల డబ్బుతో చేపట్టిన నిర్మాణాలు, జింకు షెడ్లన్నీ కూల్చివేసేశారు. స్థానిక ఎమ్మెల్యే, కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆదేశాల మేరకు అరసవల్లి ఆలయ రూపురేఖలు మార్చే క్రమంలో 'ప్రసాద్ స్కీమ్ వర్తింపజేస్తామంటూ ప్రకటించారు. దీంతో రూ.100 కోట్ల వరకు నిధులు వస్తాయని ప్రకటనలు గుప్పిస్తూ ముందుగా ఎలాంటి నోటీసులు లేకుండానే దాతలకు సమాచారం ఇవ్వకుండానే మొత్తం నిర్మాణాలు కూల్చేశారు. దీంతో అన్నదాన మండపం, ప్రసాదాల తయారీ, విక్రయాల కౌంటర్లు, అలాగే మరుగుదొడ్ల కాంప్లెక్స్, సుమారు ఆరు షెడ్లు కూల్చేశారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా ఆలయానికి ముందున్న నిర్మాణాలు, షెడ్లు కూల్చివేయడంతో దాతల మనోభావాలు దెబ్బ తిన్నాయి. తమ వారి జ్ఞాపకార్థం చేపట్టిన నిర్మాణాలకు విలువ లేకుండా పోయిందనే ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి జరిగితే మంచిదే కానీ ఎలాంటి ప్రత్యామ్నాయం లేకుండా కూల్చివేతలకు దిగితే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రస్తుత అరసవల్లి క్షేత్రంలో అన్నదాన ప్రసాదం, ఇతర ప్రసాదాల విక్రయ భవనాలు చూస్తే అర్థమైపోతుంది.



ఫిబ్రవరి 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

- జిల్లాలో 29 నుంచే ఎన్నికల కోడ్: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుందని, దీనికి సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను జిల్లా అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం జనవరి 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయ పరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా పరిధిలో 4829 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3275, కాగా మహిళా ఓటర్లు 1554 మంది ఉన్నారని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు నామినేషన్ ప్రక్రియ ముగియడానికి పది రోజుల ముందు వరకు అనగా జనవరి 31వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా ఎంపీడీఓ, వీడియో గ్రాఫర్ తో కూడిన 30 ఎంసీసీ బృందాలను మండలానికి ఒకటి చొప్పున నియమించామని కలెక్టర్ చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున తహసీల్దార్, ఎస్ఐ, వీడియో గ్రాఫర్‌తో 30 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

రణస్థలం బంద్ విజయవంతం



బంద్‌కు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ పనులను వ్యాపారులు, గ్రామస్తులతో చర్చించకుండా సర్వేలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం చేపట్టిన రణస్థలం బంద్ విజయవంతమైంది. ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. అనంతరం సర్వీస్ రోడ్డులో భారీ ర్యాలీగా వెళ్లి రణస్థలం తహసీల్దార్ ఎన్.ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. బంద్‌కు గల కారణాలు వివరించి, హైవే అధికారులతో ప్రజా ప్రతినిధుల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ స్పందిస్తూ త్వరలోనే హైవే, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

సంఘీభావం తెలిపిన కిరణ్..

ఫ్లై ఓవర్ నిర్మాణంపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హైవే అధికారులతో మాట్లాడి యు.బి. పరిశ్రమ నుంచి రావివలస వరకు ఓపెన్ పిల్లర్లతో కూడిన ఫ్లై ఓవర్ నిర్మిస్తామని చెప్పినట్లు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గుర్తు చేశారు. ప్రస్తుతం కొలతల్లో వ్యత్యాసాలు ఉండటం ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

ఆ గంటే.. కీలకమంట



గోల్డెన్ అవర్‌లో కంప్లైంట్‌తో మేలు

- సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ఆ సమయమే ప్రధానం



శ్రీకాకుళం క్రైమ్ : గోల్డెన్ అవర్.. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు మాత్రమే ఈ పదం వినుంటారు. ప్రమాదాలు సంభవించిన గంటలోపే క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చడం దీని ఉద్దేశం. ఇదే తరహాలో సైబర్ మోసాలకు గురయ్యే బాధితులు సైతం నేరం జరిగిన గంటలోగా ఫిర్యాదు చేయగలిగితే.. మన ఖాతాలో పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే వీలుంటుంది. బాధితులు చేయాల్సిందల్లా గోల్డెన్ అవర్‌లో సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేయడమే. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు ఐదువేలలోపు సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు వెళ్లాయి. తాము మోసానికి గురవుతున్న నిమిషాల్లోనే ఎన్‌సీఆర్బీకి, 1930 సైబర్ సెల్ నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు ఇవ్వడం వలన సుమారు రూ. 4.09 కోట్ల వరకు సేవ్ అయినట్లు ఈ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో తొలిసారిగా ఐదు సైబర్ కేసులకు సంబంధించి రూ. 10.13 లక్షలు బాధితులకు అందించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల వెల్లడించారు.

ఫిర్యాదు చేయాలిలా..

- మనం మోసపోయిన క్షణానే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.
- లేదంటే హెచ్‌టీటీపీఎస్://సీవైబీఇఆర్‌సీఆర్‌ఐఎంఇ.జీఓవీ.ఐఎన్ అనే పోర్టల్‌ను క్లిక్ చేయాలి. హోమ్‌పేజీలోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమాలు షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి రిపోర్ట్ అదర్ సైబర్ క్రైమ్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ వివరాలు ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫిల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలయ్యేది ఇక్కడే.
- ఈ పేజీలో ఒక ఫారం కనిపిస్తుంది.. దానిలో మనకు జరిగిన సైబర్ మోసం గురించి రాయాలి. కాకపోతే నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం (విక్టిమ్ ఇన్ఫర్మేషన్), సైబర్ నేరానికి సంబంధించి సమాచారం (సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్), ప్రివ్యూ అనే సెక్షన్లు ఉంటాయి.
- ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను సమర్పిస్తూ.. ప్రక్రియను పూర్తిచేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివరాలు సరిగా ఉన్నాయమని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి.
- తర్వాత ఘటన ఎలా జరిగిందనేది వివరాలు నమోదుచేయాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (అకౌంట్ ట్రాన్సాక్షన్ తదితర) ఫైల్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలు సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఫిల్ చేయాలి.
- అంతా వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లెయింట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ–మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు.
- ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగుడు డబ్బును వేర్వేరు ఖాతాల్లో మళ్లించేస్తాడు. లేదంటే క్రిప్టో కరెన్సీగా మార్చుకునే ప్రమాదముంది.

క్షణాల్లో ఫిర్యాదు చేయండి..

సైబర్ మోసానికి గురయ్యేవారు వెంటనే గుర్తించాలి. క్షణాల్లో ఫిర్యాదు చేస్తే మన డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలెక్కువ. లేదంటే ఎక్కడ ఉంటారో.. వారి ఖాతాలు ఏ రాష్ట్రానికి చెందినవి.. ఇవన్నీ కనుక్కోవడం పెద్ద ప్రాసెస్. 1930కు గానీ, ఎన్‌సీఆర్‌బీకి గానీ ఫిర్యాదు చేసి బ్యాంకు వాళ్లను, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.

- కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ



సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.

క్లుప్తంగా

రాగోలులో అర్ధరాత్రి హైడ్రామా

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు గ్రామంలో మెడికోలు, స్థానిక యువకులకు మధ్య బుధవారం అర్ధరాత్రి తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. మాటామాటా పెరిగి చివరికి పెట్రోల్ పోసి గదికి నిప్పటించే స్థాయికి వివాదం చేరుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఓ ప్రైవేట్ వైద్యుడు ఇంట్లో అద్దెకుంటున్న మెడికోలు ఇటీవల ఫైనలియర్ పరీక్షలు పూర్తి చేసుకున్నారు. రూమ్‌లో ఉన్న నలుగురిలో ఇద్దరు ఇళ్లకు వెళ్లిపోవడంతో మరో ఇద్దరూ మాత్రమే ఉంటున్నారు. బుధవారం రాత్రి వీరితో పాటు మరో ఇద్దరు మెడికోలు కలిపి పార్టీ చేసుకున్నారు. రాత్రి 11 నుంచి 12 గంటల మధ్య బయటకు వచ్చిన మెడికోలుకు, అదే కాలనీలో నివాసముంటున్న ముగ్గురు యువకులకు మాటామాటా పెరిగింది. దీంతో యువకులు గ్రామంలోకి వెళ్లి మరో ముగ్గురిని వెంట పెట్టుకొని వచ్చారు. అప్పటికే మెడికోలు వెళ్లిపోవడంతో గదికి పెట్రోల్ పోసి పరారయ్యారు. పెద్దగా మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి యజమాని సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంలో ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిసింది. అయితే ఎవరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదని రూరల్ ఎస్‌ఐ రాము తెలిపారు.

న్యాయం చేయండి


ఉప్పాడ భాస్కరరావు, బృందావతి దంపతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : చిన్న కోడలి తీరు కారణంగా నిరాశ్రయులమైన తమను ఆదుకోవాలని భామిని మండలం గురండి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు దుప్పాడ భాస్కరరావు, బృందావతి వేడుకుంటున్నారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ తమకు ముగ్గురు కుమారులని, అందులో చిన్న కుమారుడు నేతాజీ ఖజానా శాఖలో గ్రేడ్–2 అధికారిగా ఉద్యోగం చేసేవాడని, రెండేళ్ల క్రితం కొత్తూరు మండలం ఈరపాడు గ్రామానికి చెందిన భావనతో వివాహమైందని చెప్పారు. 2024 ఏప్రిల్ 4న నేతాజీ మృతి చెందాక కోడలు తమను దూరం పెట్టిందన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందడమే కాకుండా కుమారుడి పింఛన్ కూడా పొంది తమకు చిల్లిగవ్వ ఇవ్వడం లేదని వాపోయారు. కుమారుడి పింఛన్ డబ్బుల్లో వాటా ఇప్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయమై నెల కిందటే కలెక్టర్‌కు, జిల్లా ఖజానా ఉన్నతాధికారికి సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎయిర్‌ఫోర్స్‌తో ఉజ్వల భవిష్యత్తు


యువతకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: వాయుసేన(ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో చేరితో ఉజ్వల భవిష్యత్తుతో పాటు దేశానికి సేవ చేసే అవకాశం కలుగుతుందని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, ప్రైవేటు కాలేజీల్లో ఎయిర్ ఫోర్స్ ప్రతినిధులతో కలిసి యువతకు అవగాహన కల్పించారు. సికింద్రాబాద్‌లోని 12 ఎయిర్ మెన్ సెలక్షన్ కమాండింగ్ ఆఫీసర్, వింగ్ కమాండింగ్ గురు ప్రీత్ అట్వాల్ ఆదేశాల మేరకు కలెక్టర్ అనుమతితో జిల్లాలో ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు అర్హతలు, ఫిజికల్ ఫిట్‌నెస్ వివరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఎ.శైలజ, సార్జంట్ ఎస్.కె.జూట్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు


లక్కీ డ్రా తీస్తున్న డీఎస్‌ఓ సూర్యప్రకాశరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు అన్నారు. హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో నగరంలోని వేదమాత గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో గురువారం బంపర్ డ్రా నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 22 హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో ఆగస్టు 15 నుంచి అక్టోబర్ 31 మధ్య గ్యాస్ స్టవ్‌లను కొన్న వినియోగదారుల్లో విజేతలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఆర్.శ్యామలాంబ, బి.మణి, వి.మాధవి, కె.ప్రసాద్, ఎస్.సమీర్, జి.రంగమ్మలకు బహుమతులు దక్కాయి. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కె.శ్రీహర్ష, ప్రతినిధులు దుప్పల రవీంద్రబాబు, డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), బొడ్డేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మన లక్ష్యం.. సురక్షిత గమ్యం

- రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నిబంధనలు మీరితే చలానాలు తప్పవని హెచ్చరికలు
- హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం


ఆటో బయట ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణిస్తున్న విద్యార్థులు

2024లో ప్రమాదాలు	889
మృతుల సంఖ్య	285 మంది
మద్యం తాగి వాహనాలు నడిపిన వారు	2151
హెల్మెట్ చలానాలు	42,735
ట్రిపుల్ రైడింగ్	3,028
రూల్స్ అతిక్రమించిన వారు	79,112
అపరాధ రుసుం	రూ. 3.18 కోట్లు


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ..

శ్రీకాకుళం క్రైమ్ :

ఇంటి నుంచి బయల్దేరేముందు మన కుటుంబీకులు ఎన్నో జాగ్రత్తలు చెబుతారు. తిరిగి ఇంటికి ఎప్పుడు క్షేమంగా చేరుతామో అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తారు. అయితే ఒక్కసారి రోడ్డుపైకి వచ్చాక మనం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఎదుటి వారు నిర్లక్ష్యంతో వాహనాలు నడిపినా భారీ మూల్యం చెల్లించక తప్పదు. జిల్లాలో 2024లో ఏకంగా 889 ప్రమాదాలు సంభవించి 285 మంది మృత్యుఒడిలోకి జారారంటే ప్రమాదాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఊహించుకోవచ్చు. వాహనచోదకుల నిర్లక్ష్యంతో పాటు మద్యం తాగి వాహనాలు నడపడం.. అతి వేగం.. మైనర్లకు వాహనాలివ్వడం.. సీటుబెల్టు ధరించకపోవడం.. హెల్మెట్ పెట్టుకోకపోవడం వంటివి ప్రమాదాలకు మేజర్ కారణాలని స్వయంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అంటున్నారు. జిల్లావ్యాప్తంగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులు 2,151 నమోదవడాన్ని బట్టి చూస్తే విషయం ఇట్టే అద్దంపడుతోంది. ఇదే కాక 2024లో రహదారి నిబంధనలు అతిక్రమించిన 79,112 మందికి రూ. 3,18,67,736లకు పైగా అపరాధ రుసుం పోలీసులు విధించారు. ఈ నేపథ్యంలో సురక్షిత ప్రయాణంపై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రహదారి భద్రతా వారోత్సవాల పేరిట వాహనచోదకులకు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు.


ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ..

ఛలానాలు విధించింది వీరికే..	
హెల్మెట్	42,735
డ్రైవింగ్ లైసెన్సు లేనివారు	6,495
ట్రిపుల్ రైడ్	3,028
సెల్‌ఫోన్ డ్రైవింగ్	2,167
డ్రంక్ అండ్ డ్రైవ్	2,151
ఓవర్‌స్పీడ్ (ర్యాష్‌డ్రైవింగ్)	130

అవగాహన కల్పిస్తున్నాం..



రోడ్డు ప్రమాదాలు జరగకుండా రద్దీ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నాం. రోడ్డుకు ఇరువైపులా పొదలను తొలగిస్తున్నాం. వేగాన్ని నియంత్రించడంలో భాగంగా స్పీడ్‌బ్రేకర్లను, ఇసుక డ్రమ్ములను, సైన్ బోర్డులను, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశాం. మద్యం తాగి వాహనాలు నడిపేవారికి నెలరోజుల నుంచి మూడు నెలల వరకు జైలు శిక్షపడేలా కోర్టుకు కూడా పంపిస్తున్నాం. మైనర్లకు వాహనాలిచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

ఇన్సూరెన్సు తప్పనిసరి..



ఎక్కువ ప్రమాదాలు హెల్మెట్లు లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. కొందరు హెల్మెట్ ధరించినా క్లిప్ పెట్టరు. బీ1ఎస్ స్టాండర్డ్ హెల్మెట్లు సురక్షితం. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ మీరుతూ ప్రమాదాలు చేసేవారిపై జరిమానా విధిస్తూనే మూడు నెలలపాటు లైసెన్సు రద్దు చేస్తున్నాం. మళ్లీ మళ్లీ చేస్తే శాశ్వత రద్దే. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ (ఆపోజిట్) డైరెక్షన్స్‌లో వెళ్తూ కంట్రోల్ చేయలేకపోవడం, అతివేగం ఘోర ప్రమాదాలకు దారి తీస్తుంది. ఇన్సూరెన్సు తప్పనిసరి.

– ఎ.విజయసారథి, జిల్లా ఉపరవాణా శాఖాధికారి (డీటీసీ), శ్రీకాకుళం

నిత్యం చలానాలు..



నగరంలో నెలకు 2,700 నుంచి మూడువేల పైగా చలానాలు విధిస్తున్నాం. వీటిలో హెల్మెట్ వాడని, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు నడిపే ద్విచక్రవాహనదారులపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. ఎస్పీ సూచనలతో వాహనదారులను అవగాహన పరుస్తున్నాం. గతంతో పోల్చితే నగరంలో ప్రమాదాలు తగ్గాయి.

– వానపల్లి నాగరాజు, సీఐ, ట్రాఫిక్

జిల్లాకేంద్రంలో ఎన్నో మార్పులు..



ట్రాఫిక్ దృష్ట్యా ఎన్నో మార్పులు చేశాం. క్రాడ్ ఏరియాలు, కూడళ్లలో కొందరి సౌజన్యంతో 150కు పైగా స్టాపర్స్ పెట్టాం. ప్రైవేట్ ట్రావెల్స్‌ను కొత్తరోడ్డు వెంబడి, ఆటోలను రిమ్స్ నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా మళ్లించి ట్రాఫిక్‌ను నిలువరించాం. ట్రాఫిక్ వారితో పాటు అవసరాన్ని బట్టి లాఅండ్‌ఆర్డర్ పోలీసులను, హోంగార్డులను సైతం వినియోగిస్తున్నాం. రథసప్తమి పురస్కరించుకుని మరింత పకడ్బందీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

ఏం జరుగుతోంది..?

- ఇష్టారాజ్యంగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు
- రచ్చకెక్కుతున్న టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వ్యవహారం


టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

టెక్కలి: టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్‌గా ఇటీవల మందస మండలానికి చెందిన ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జరుగుతున్న ఎనీవేర్ రిజిస్ట్రేషన్లతో కార్యాలయం వ్యవహారం రచ్చకెక్కుతోంది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల వెసులుబాటుతో ఇతర మండలాలకు చెందిన కొంతమంది మధ్యవర్తులు ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళితో పాటు కోటబొమ్మాళి, సారవకోట, వజ్రపుకొత్తూరు మండలాల్లో కొన్ని గ్రామాలను కలుపుకుని సుమారు 240 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించి భూముల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లకు ఈ కార్యాలయమే ఆధారం. అయితే ఇవి కాకుండా ఇతర మండలాల పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నప్పటికీ ఎనీవేర్ వెసులుబాటుతో ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఆయా మండలాల్లో జరగని రిజిస్ట్రేషన్లు ఇక్కడ సులువుగా జరుగుతుండటంతో, ఇతర ప్రాంతాలకు చెందిన మధ్యవర్తులు చక్రం తిప్పుతున్నారు. తాజాగా బుధవారం మందస మండలానికి చెందిన ఒక వ్యక్తి ఇదే కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ నేతృత్వంలో డాక్యుమెంట్లతో హడావుడి చేయడం కనిపించింది. దీనిపై సబ్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. సదరు వ్యక్తి తన క్లాస్‌మేట్ అని చెప్పడంతో కార్యాలయంలో జరుగుతున్న ఎనీవేర్ వ్యవహారాలు సందేహాలకు తావిస్తున్నాయి. అయితే ఎనీ వేర్‌లో ఎటువంటి తప్పిదాలు జరగడం లేదని, రూల్స్ ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామంటూ ఎస్ఆర్‌వో చెప్పడం కొసమెరుపు.

వైఎస్సార్ సీపీలో సమర్థులకు కొదవ లేదు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వ్యక్తిగత కారణాల వల్ల కొందరు పార్టీ వీడుతున్నారని, అంతమాత్రాన వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం ఉండదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పార్టీలో సమర్థులైన నాయకులకు కొదవ లేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ఖాళీ అయిపోందని అచ్చెన్నాయుడు అనుకోవడం భ్రమ అని చురకలు అంటించారు. నియోజకవర్గంలో పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులను నియమించగా గురువారం వారి పరిచయ కార్యక్రమంలో దాసన్న మాట్లాడారు. గత ఐదేళ్లలో అర్హులైన వారందరికీ సంక్షేమం అందజేశామని, ఇప్పటికీ తాము ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లగలమని అన్నారు. కూటమి వచ్చాక హత్యలూ, అత్యాచారాలు పెరిగాయని, చిరు ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు.

ఈ ఆరు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అరంగి మురళి, వాన గోపి లతో పాటు పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రైతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాటిచ్చి మర్చిపోవడం బాబు నైజం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు గాల్లో తేలియాడుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఎద్దేవా చేశారు. సోంపేట పట్టణంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోదతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఊరించే విధంగా అబద్ధపు హామీలు గుప్పించడం, గెలిచాక వాటిని మర్చిపోవడం చంద్రబాబు నైజమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లోనే చంద్రబాబు నిజరూపం బయటపడిందన్నారు. కోవిడ్ వంటి కష్ట కాలంలో కూడా వైఎస్ జగన్ ఇచ్చిన మాట మర్చిపోకుండా సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. పింఛన్లు పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న సర్కారు ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేకపోయిందన్నారు.

సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు శిలగాన బాస్కరరావు,ఎంపీటీసీ సభ్యులు నిమ్మన లీలారాణి, పొడగు కామేష్, బొమ్మిడి ధర్మరాజు, పార్టీనాయకులు రౌతు విశ్వనాదం, పిన్నింటి రేఖారావు, జక్కం రమేష్, ఈశ్వరరావు, మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఏపిటోరియా పరిశ్రమలో యుటిలిటీ–6లో గురువారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో విజయనగరానికి చెందిన మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ కార్మికుడు పి.రమేష్, రెల్లివలసకు చెందిన మెయింటెనెన్స్ ఉద్యోగి ఐ.నర్సునాయుడులు గాయపడ్డారు. వీరిని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

పలాసలో మృతదేహం కలకలం

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారిని ఆనుకుని కోసంగిపురం చెరువు వద్ద గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. గురువారం అటుగా వెళుతున్న ఓ వ్యక్తి ఈ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకున్న కాశీబుగ్గ పోలీసులు ఆధారాలు సేకరించి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెడలో రుద్రాక్షమాల ప్యాంటు, షర్ట్ ధరించి ఉన్న గుర్తు తెలియని యువకుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇదే ప్రాంతంలో వారం కిందట కూడా మృతదేహం లభ్యమైంది. విద్యుత్ వైర్లు చుట్టేసి అనుమానాస్పదంగా మృతి చెందాడు. రైలు ట్రాక్‌పై వారం రోజుల వ్యవధిలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. కారణాలు ఏమైనా ఇటీవల కాలంలో అధికంగా మృతదేహాలు లభ్యంపై స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ పోలీసులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో పాత్రునివలస గ్రామానికి చెందిన బరాటం యుగంధర్ (18) మృతిచెందాడు. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల పెదపాడు పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రావాడ తాతారావుకు చెందిన ఓ షాపు అడ్డుగా ఉండటంతో దాన్ని వేరే ప్రాంతంలో మార్చేందుకు బుధవారం రాత్రి ప్రొక్లెయిన్‌తో పనులు చేపట్టారు. బడ్డీను తరలించే క్రమంలో హైటెన్షన్ వైర్లు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరగడంతో యుగంధర్ అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈయనతో పాటు బరాటం ఉపేంద్ర, రావాడ జగదీష్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయం

అరసవల్లి: జిల్లాలో కుష్టు వ్యాధి నివారణే ధ్యేయంగా వైద్యశాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కుష్టు వ్యతిరేక దినం నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణకు పిలుపునిస్తూ ర్యాలీ చేపట్టారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వ్యాధిపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ శ్రీకాంత్, డీపీఎంవో వాన సురేష్, డీఎస్‌ఎంవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ తదితరులు

పట్టుబడిన బైక్ దొంగలు


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు. (ఇన్‌సెట్లో) వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

- 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

టెక్కలి రూరల్: టెక్కలి పరిసర ప్రాంతాల్లో రెండు నెలలుగా జరిగిన ద్విచక్ర వాహనాల చోరీలకు సంబంధించి టెక్కలి పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టెక్కలి సీఐ ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గత రెండు నెలలుగా టెక్కలి పరిధిలోని పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడంపై ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మూర్తి ఆదేశాల మేరకు ఒక క్రైం టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. ఇందులో భాగంగా టెక్కలి అంబేడ్కర్ వీధికి చెందిన పడాల అఖిల్(19) అనే యువకుడిపై అనుమానం రావడంతో నిఘాపెట్టారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు మెళియాపుట్టి రోడ్డులోని నాలుగురోడ్ల జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు ఐదు ద్విచక్ర వాహనాలపై వస్తుండగా వారిని పట్టుకునే ప్రయత్నంలో ఇద్దరు వాహనాలను వదిలి పరారయ్యారు. మిగిలిన ముగ్గురిని అదుపులో తీసుకుని, వారి వద్ద నుంచి 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు మైనర్లు కాగా, మరొకరు టెక్కలికి చెందిన పడాల అఖిల్‌గా గుర్తించారు. ఆ యువకుడిని విచారించగా తాను ఒడిశా రాష్ట్రం రాయగడ ప్రాంతంలో బంధువులు ఇంటికి వెళ్లేవాడినని, అక్కడ కొంతమంది యువకులతో పరిచయం ఏర్పరుచుకుని వారితో కలసి ద్విచక్ర వాహనాలు చోరీ చేసేవాడినని చెప్పాడు. రాయగడకు చెందిన వారిని టెక్కలికి రప్పించి వారితో కలిసి ద్విచక్ర వాహనాలు చోరిచేసేవాళ్లమని, దానిలో భాగంగా డిసెంబర్ 26, 27 తేదీలలో టెక్కలిలో 2 ద్విచక్ర వాహనాలు, జనవరి 10, 11వ తేదీలలో మరో మూడు ద్విచక్ర వాహనాలు టెక్కలిలో చోరిచేసినట్లు అంగీకరించాడు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా మునిగఢ ప్రాంతంలో డిసెంబర్ 5న ఒక ద్విచక్రవాహనం, పార్వతీపురం మన్యం జిల్లాలో డిసెంబర్ 30న ఒక ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు తెలిపారు. వారు చెప్పిన ఆధారాల ప్రకారం మొత్తం 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. తప్పించుకున్న మరో ఇద్దరిలో రాయగడకు చెందిన వ్యక్తి, కొరాపుట్టికి చెందిన మరో వ్యక్తిగా గుర్తించామని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి ఆస్పత్రి ఘటనపై మంత్రి సీరియస్


విచారణ చేపడుతున్న డాక్టర్ శ్రీనుబాబు తదితరులు

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో శిశువు తొడలో ఇంజెక్షన్ సూది ఉండిపోయిన ఘటనపై 'సాక్షి'లో పసిబిడ్డ తొడలో సూది అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సీరియస్ అయ్యారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి నరసన్నపేట ఆస్పత్రి నుంచి సూపరింటెండెంటెంట్ డాక్టర్ ఎస్.శ్రీనుబాబు, ఆఫీస్ సూపరిండెంటెంట్ కాళీ చరణ్‌తో కూడిన కమిటీని జిల్లా కేంద్రాస్పత్రికి పంపించారు. వారు ఘటన జరిగిన సమయంలో ఆస్పత్రిలో ఉన్న సిబ్బందిని ఆరా తీశారు. ఇంజెక్షన్ చేసినప్పుడే తొడలో సూది విరిగిపోయినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అనంతరం సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడు గ్రామంలోని బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు.